బస్ దిగుతూ చూసాను, ఆ టెర్లిన్ షర్టు వ్యక్తి వంక. అతను నా వంక ఆశ్చర్యంగా, కొద్దిగా జాలిగా చూసాడు వెంటనే చిద్విలాసంగా నవ్వి కన్ను కొట్టాడు నాకు

నా స్థానంలో వుండవల్సిన ఆ టెర్లిన్ షర్టు వ్యక్తి రపీమని ఖాళీ అయిన సీట్లో కూర్చున్నాడు.

★

# డబ్బెవరికి చేదు

హైద్రాబాద్‌లోని ఓ బేంక్‌ని పట్టపగలే దోచుకున్నాడో దొంగ. నాటు బాంబులు, తుపాకీతో కేషియర్లని బెదిరించి ఇరవై ఆరు లక్షల రూపాయలతో పరారీ అయ్యాడు

క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్ మెంట్ (సి.ఐ.డి)కి చెందిన డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ పిళ్ళై ఆ కేసు టేకప్ చేసాడు. బేంక్ కౌంటర్ల మీద దొరికిన వేలి ముద్రలని, రిఫింగర్ ప్రింట్ బ్యూరోలోని అంతకు ముందేవున్న వేలి ముద్రలతో పోల్చి చూసి, అవి పంజాబ్ రాష్ట్రానికి చెందిన గజదొంగ హర్ భజన్ సింగ్‌వని గుర్తించారు. హర్ భజన్ సింగ్ సంబంధించిన ఫైల్‌ని తిరగేసాడు.

హర్ భజన్ సింగ్ ఆచూకి తేలికగా కనుకున్నాడు పిళ్ళై. వెంటనే చండీఘర్‌కి అరవై ఆరు కిలోమీటర్ల దూరంలోవున్న ఓ చిన్న పల్లెకి ప్రయాణమయ్యాడు. ఎలాగయినా ఆడబ్బు తనే కొట్టేయాలని.

ముందే ఫోటోలుచూసి వుండటంచేత హర్ భజన్ సింగ్‌ని ఆ పల్లెటూరులోని నాలుగురోడ్ల కూడలిలోగల టీబంక్ ముందు తేలికగా గుర్తించ గలిగాడు పిళ్ళై.

పిస్తోలు తీసి సింగ్ ఛాతిమీద గుచ్చాడు. దురదృష్టవశాత్తు పిళ్ళైకి పంజాబీ భాష రాదు. సింగ్‌కి తమిళంకాని, ఇంగ్లీషుకానీ రాదు. ఆ టీబంక్ యజమాని చాలాకాలం క్రితం తమిళనాడునించి వచ్చి అక్కడ సెటిల్ అయిన అరవవాడు. ఆయన్ని దుబాసిగా వ్యవహరించమని కోరాడు పిళ్ళై.

"ఇతనిపేరు హర్ భజన్‌సింగ్ అవునో కాదో అడగండి."

టీబంక్ యజమాని సింగ్‌తో మాట్లాడి "ఆమ్ హర్‌భజన్ సింగ్" చెప్పాడు.

"హైదరాబాదులోని బేంక్‌స్ట్రీట్‌లో ఎనిమిదిరోజుల క్రితం వున్నాడోలేదో అడగండి."

మళ్ళీ ఆయన మాట్లాడి "ఆమ" వున్నాడుట. చెప్పాడు

"ఇరవై ఆరు లక్షలరూపాయలు దోచుకెళ్ళాడో లేదో అడగండి" చెప్పాడు పిళ్ళై. సింగుతో మాట్లాడి "ఆమ" దోచుకున్నాడట" చెప్పాడు.

వెంటనే పిస్తోలు గొట్టాన్ని హర్‌భజన్‌సింగ్ ఛాతిలో ఇంకాస్త గుచ్చి "ఆ డబ్బు ఎక్కడదాచాడో చెప్పకపోతే ట్రిగర్ నొక్కి చంపుతానన్నానని చెప్పండి" చెప్పాడు.

ఆ సంగతి చెప్పగానే హర్ భజన్‌సింగ్ వళ్ళంతా చెమటలు పట్టాయి. పంజాబీ భాషలో గబ గబా చెప్పాడు_టీ బంక్ యజమానికి భయంగా.

"చంపవద్దని చెప్పు. భార్యా, పిల్లలు గలవాణ్ణి. ఆ డబ్బుని మా అత్తగారింటిలోని మర్రి చెట్టుకింద పాతి పెట్టాను."

ఏం చెప్పాడన్నట్లు ఆసక్తిగా చూసాడు పిళ్ళై.

టీ బంక్ యజమాని చెప్పాడు పిళ్ళైతో "ఏడ్చినట్టే వుంది. ఇంత కష్టపడింది మీకు చెప్పడానికా? కాల్చితే కాల్చుకోపో! అంటున్నాడండి.... నాకొద్దిగా పనివుంది. వెళతాను." చెప్పాడు టీబంక్ యజమాని పిళ్ళైతో.